# ది స్నాబ్

## గొల్లపూడి మారుతీరావు

**మేం నాటకాలు వేసే తొలి రోజుల్లో మాకు ప్రధాన పోషకుడు మా క్లాసుమేట్ భానోజీరావు. వాళ్ళ నాన్న పోర్టులో పాత షిప్పుల్ని పగలగొట్టి పార్టులు అమ్మే వ్యాపారంలో లక్షలు గడించాడు. ఆ రోజుల్లో బులెట్ మోటార్ సైకిలున్న ఒకే ఒక్క స్టూడెంట్ భానోజీ. వాడికి నాటకాలంటే బొత్తిగా తెలీదు. తెలుసుకోవాలన్న ఆకాంక్ష కూడా లేదు. అయితే మేమెప్పుడు నాటకం ఆడాలన్నా సరిగ్గా వంద రూపాయలిచ్చేవాడు. అంతకు మించి చచ్చి గింజుకున్నా రూపాయి యిచ్చేవాడు కాదు. మా సమాజానికి నేనే రచయితని, ప్రధాన నటుడ్ని, ప్రయోక్తని, వక్తని, మేకప్‌మాన్‌ని అన్నీను. ఆ వందలోనే మా ఖర్చులన్నీ పోనూ అయిదో పదో మిగిలేది. ఆ రోజుల్లో వాడి ఆసరావల్లే ముద్రితం కాని ఎన్నో నాటికలు రాశాను. అవి నా నాటక రచయిత జీవితానికి నాంది పలికిన రోజులు. .**

అయితే భానోజీతో ఓ చిక్కు వుండేది. నాటకానికి ఏ కిరాయి నటీమణిని తీసుకొచ్చినా మూడో రోజుకి ఆ అమ్మాయితో స్నేహం కలిపేసేవాడు. ఆ అమ్మాయి వాడికి టంకం పాడిలాగ అతుక్కుపోయేది. దాన్ని రిహార్సల్సు టైముకి హాజరు పెట్టడం మా వల్లయేది కాదు. చూస్తూ చూస్తూ వాడినేమీ అనలేకపోయే వాళ్ళం. ఎంచేతంటే వాడొక్కడే మా పోషకుడు. "ఒరేయ్! మమ్మల్ని నాటకం వేసుకోనివ్వరా-సరిగ్గా పది రిహార్సల్సయినా పడలేదురా" అని బతిమాలుకొనే వాళ్ళం. వాడు చిరునవ్వు నవ్వి- మమ్మల్ని దయతలిచి నట్టు ఓ రెండు మూడు గంటలు వదిలేవాడు హీరోయిన్‌ని. ఆ వచ్చిన పిల్ల కూడా వీడి హంగు, కోటూ చూసి మమ్మల్ని చిన్న చూపుతో చూసేది. మేం రోజంతా కాలేజీకి వెళ్ళి మాసి కారే మొహాలతో రిహార్సల్స్ గదిలో పడిపోయేవాళ్ళం. వీడు సెంటు వాసనల్తో బులెట్‌లో దిగేవాడు. పైపెచ్చు నాటక రిహార్సల్స్‌లో నేను చెప్పే సూచనలు హీరోయిన్ వింటే వినేది, వినకపోతే దబాయించేది. ఇలాంటి అవకతవకల ప్రదర్శనలతో కాలం గడిచిపోయేది.

ఈ బాధలన్నీ తెలిసిన కామయ్యపంతులనే మిత్రుడు- ఆ రోజుల్లోనే ఎక్సయిజ్ డిపార్టుమెంటులో అటెండరుగా పనిచేసేవాడు-ఒక వ్యక్తి గురించి చెప్పాడు.

"మా ఆఫీసులో మల్లిక అనే అమ్మాయి వుందిరా. నాటకాల గురించి బొత్తిగా తెలీదుకాని, ఆసక్తి వుంది. మన కష్టాల గురించి చెప్పాను. వేషం వేస్తానంది" అన్నాడు.

మల్లిక అనగానే మంచి గంధం చెక్కలాంటి ముఖం, వెన్నపూస లాంటి శరీరం, ఉద్యోగం చేస్తోందంటే ఉల్లి పొరలాంటి చీరె-మనస్సులో కదిలి "నాయనా! ఉద్యోగం చేస్తున్న పిల్ల అంటున్నావు-ఈ భానోజీగాడు దానితో కాపరం పెడతాడేమో" అన్నాను నిస్పృహగా.

కామయ్యపంతులు చిరునవ్వు నవ్వాడు. "ఆ అమ్మాయిని చూస్తే నువ్వలా అనవు" అన్నాడు.

"ఏం? మనవాడి జల్సాలకి లొంగని ఉక్కు మనిషా?" అన్నాను.

"రేపు పిలుచుకొస్తాను. నువ్వే చూస్తావుగా?" అన్నాడు. వాడి ధైర్యంచూసి నాక్కాస్త ఆశ్చర్యం కలిగిన మాట నిజమే. కాని మర్నాడు మల్లికని చూసి నిర్విణ్ణుడినయిపోయాను.


మల్లికని చూడగానే ఎవరికయినా ముందు జరిగేదదే.

షాక్ అవక తప్పదు. చూడగానే వెగటు పుట్టించే అతి వికారమయిన నలుపు. ఒక్కసారిగా గుండె జుగుప్సతో జలదరించి దూరంగా జరగాలనిపిస్తుంది. ముఖం కోలగా వుంది. జుత్తు చిన్న పిలక. ఈ మూడు అవలక్షణాల్ని తట్టుకుని తదేకంగా మల్లికని చూడగలిగితే మత్తుగా నిమీలితాలుగా వున్న అపురూపమయిన కళ్ళు ఆకర్షిస్తాయి. శరీర సౌష్టవంలో ఏ ఆడదీ ఆమెకి పోలదు. అంత తీర్చినట్టుంది. నవ్వితే నల్లటి కారు మేఘం వెనక కాంతి పుంజం మెరిసినట్టు చక్కటి పలువరస. శాపంతో క్రుంగిపోయిన గంధర్వ కన్యలాగ వుంది.

తను కురూపినని ఆమెకీ తెలుసు. అయిష్టంగా చూసే మనని 'ఎపాలజీ'తో చూస్తాయి ఆ కళ్ళు. వీలయితే ఆ ముఖాన్ని భూమిలోకి తొక్కెయ్యాలని ఎంత కుంచుకుపోయి తలదించుకుంటుందో!

కామయ్యపంతుల్ని రెక్క పట్టుకుని బరబర ఈడ్చుకు వెళ్ళి "ఈవిడతో నాటకం వేయించాలని తీసుకు వచ్చావురా దొంగనా కొడకా!" అన్నాన కోపంగా.

మా టీమ్‌లో కామయ్యపంతులే మేకప్ చేస్తాడు. చిరునవ్వు నవ్వి-నా చెయ్యి వదిలించుకుని మల్లికకి గంట సేపు మేకప్ చేశాడు. తీరా మేకప్ అయాక ఆ అమ్మాయిని చూసి నివ్వెరపోయాను. అద్దంలో తన ముఖం తను చూసుకొంది గావును. అంతకు ముందు ఆమె కళ్ళలో కనిపించిన 'ఎపాలజీ' స్థానంలో తృప్తి చోటుచేసుకుంది. మనిషి పూర్తిగా మారిపోయింది. రంగు కారణంగా ఆమెలో కనిపించిన లోపాలను మేకప్ భర్తీ



చేసింది. నవరం పెట్టె పిరుదుల వరకు జడ దిగింది. ఇప్పుడు కట్టిన సిల్కు చీరెలో ఆమె అంగ సౌష్టవం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మూర్తీభవించిన దేవ కన్య లాగుంది. నా నోట మాట రాలేదు.

“నాటకంవాడు ఎలాగూ భానోజీ రాడు. మిగతా సమయాల్లో ఆమెని కన్నెత్తి చూడడు. నటన విషయంలో ఏ తంటాలు లేవు. ఇంతకంటె మనకి మంచి ఛాన్స్ రాదు. భానోజీ బారి నుంచి బయటపడే హీరోయిన్ మల్లిక ఒక్కరే. ఆ తర్వాత నీ యిష్టం” అన్నాడు కామయ్యపంతులు.

ఇప్పుడు వారి అభిప్రాయం మీద నాకు గౌరవం పెరిగింది. వెంటనే మల్లికతో రిహార్సల్సు ప్రారంభించాను. ఎందుకూ పనికిరాదనుకున్న నలిగిపోయిన ఉలిపిరి కాగితానికి ఊపిరి వచ్చినట్టు అందరి హీరోయిన్ల కన్నా అలవోకగా దారిలో పడింది మల్లిక. భానోజీ కొత్త హీరోయిన్ వచ్చిందనగానే సెంటు వాసనల్తో హడావుడిగా రిహార్సల్స్ గదికి వచ్చి మల్లికని చూసి ఒక్క క్షణం బిత్తరపోయాడు. మాకందరికీ నవ్వొస్తోంది. “మీకు బుద్ధుందా లేదా? ఇదేం హీరోయిన్రా బాబూ” అన్నాడు. “మా బాధలు మావి. నీక్కావాలంటే తన్నుకుపో. రిహార్సల్సుకి మాత్రం వదిలిపెట్టు” అన్నాను.



“ఛీ” అని ఛీదరించుకున్నాడు. వాడికి ఒళ్ళు జలదరించింది. ఆ తర్వాత ఎప్పుడూ రిహార్సల్సు గదివేపు కూడా భానోజీ రాలేదు. దాదాపు పది సంవత్సరాలపాటు ఏభై నాటకాలకు పైగా మల్లిక మా సమాజంలో నాటకాలు వేసింది.

మేకప్‌తో వున్న ఆ కొద్ది క్షణాలే ఎవరితోనయినా స్వేచ్ఛగా మాట్లాడేది. నలుగురిలాగ యధాలాభంగా తిరిగేది. మేకప్ తీసెయ్యగానే ఎప్పుడు వెళ్ళిపోయేదో మాక్కూడా తెలిసేది కాదు. ఒకవేళ ఎదురుగా తారసపడినా వీలయినంతగా తన ముఖం కనిపించకుండా దాచుకునేది. ఎదుటి వ్యక్తి ఆశ్చర్యాన్నుంచో, వెగటుతనం నుంచో పారిపోవడానికే ప్రయత్నించేది.

వ్యక్తిగా అంత మంచి అమ్మాయిని చూడం. నలుగురి ఆడపిల్లల్లాగ ఆమెలో కోరికలుండవా? పిట పిటలాడే ఆ యవ్వనానికి ఆట విడుపును ఆమె మనస్సయినా ఆశించదా? అలాంటి ఆలోచనలయినా ఆమెలో వస్తాయా? ఎవరికీ తెలిసేది కాదు. మల్లిక సూర్యరశ్మి కూడా చొరబడని చీకటి గుహ. అందులో ఏమున్నాయో ఎవరికీ తెలియని నిగూఢ రహస్యం.

విచిత్రమేమిటంటే- అందంగా, ఆకర్షణీయంగా మేకప్ అయి స్టేజిమీదకి వచ్చినప్పుడు, ఎన్నో రొమాంటిక్ సీనులు నటించే సందర్భంలో నాటకంలో మాలాంటి వాళ్ళం ఆప్యాయతని, ప్రేమని నటించినా ఆమె కళ్ళల్లో ప్రోత్సాహం కనిపించేది కాదు.

ఒకసారి ఉండబట్టలేక అడిగాను-“నలుగురి ఆడపిల్లల్లాగ పెళ్ళి చేసుకోవాలని, ఓ యింటిదానిని కావాలని నీకనిపించదా?” అని.

ఒక్కసారి నావేపు ఆశ్చర్యంగా చూసింది. బహుశా అటువంటి ప్రశ్న ఎవరయినా అడుగుతారని కూడా ఆమె ఊహించలేదనుకుంటాను. సమాధానం- జలతారు తీగెలాగ చిరు నవ్వు నవ్వింది.

ఏ అడివిలోనో పూసి, ఎవరి కంటాపడకుండా రాలిపోయే గడ్డి పువ్వులాగ కనిపించేది మల్లిక నాకు. ఏమయినా మల్లిక వచ్చాక మాకు భానోజీ సమస్య తీరింది. పదేళ్ళ తర్వాత నాకు ఉద్యోగం బదిలీ మీద చిత్తూరు వెళ్ళిపోయాను. ఆ తర్వాత కొన్నాళ్ళు మా

కామయ్యపంతులు మిగతా వాళ్ళచేత నాటకాలాడించాడు. వాడు పోస్టుమాన్‌గా ఉద్యోగం వచ్చి విజయనగరం వెళ్ళిపోయాడు. నా నాటక సమాజం ఆ విధంగా మూలన పడింది. క్రమంగా మల్లిక గురించి కూడా మరిచిపోయాను.

ఓసారి హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో నాటకం వేసి స్టేజి దిగుతూండగా ఉన్నట్టుండి స్టేజి పక్కన నిలబడి మల్లిక పలుకరించింది. ఒక్క క్షణం ఆమెని గుర్తుపట్టలేక పోయాను. వొళ్ళు బాగా వచ్చింది. తాంబూలం నములుతోంది.

"మీ గురించి ఒకటి రెండు సార్లు పేపర్లో చూశాను. మేమిప్పుడు హైదరాబాద్‌లోనే వుంటున్నాం" అంది.

ఎందుకనో మనిషిలో యిదివరకటి బెరుకు, కుంచుకుపోయే స్వభావం తగ్గింది. నేను చూడని హుషారు వుంది. పక్కనే ఎర్రటి వూలు స్వెట్టరు వేసుకున్న నాలుగేళ్ళ అబ్బాయి.

"వీడు మా అబ్బాయి-సుధాకర్. మీరు మా వారికి కూడా తెలుసు. ఒకసారి పేపర్లో మీ ఫోటో కూడా ఆయనకి చూపించాను. వుండండి, ఆయనిక్కడే వున్నారు, పిలుస్తాను" అని పరిగెత్తింది.

నా ఆశ్చర్యానికి అంతులేదు. మల్లికకి పెళ్ళయింది. నాలుగేళ్ళ కొడుకు కూడా వున్నాడు. సహారా ఎడారిలో మల్లె తీగ ప్రాణం పోసుకున్నప్పుడు, బంగాళా ఖాతం నడిబొడ్డున మంచినీటి సెల లేచిందన్నప్పుడు కలిగే దిగ్భ్రమ లాంటిది కలిగింది.

మల్లికని పెళ్ళి చేసుకున్న భర్త ఎలాంటి వాడయి వుంటాడు? ఆమెలో ఏం చూసి పెళ్ళి చేసుకున్నాడు? నాలుగేళ్ళ కొడుకుని, కళ్ళలో తృప్తిని యివ్వగలిగిన అయిదేళ్ళ ఆనందమయమయిన సాంసారిక జీవితంలోగల రహస్యం ఏమిటి? మల్లిక భర్తని కలుసుకోవడానికి ఆతృతగా ఎదురు చూశాను. దివాకర్‌ని కలుసుకొన్నప్పుడు నా ఆశ్చర్యం అంతా యింతా కాదు. ముట్టుకుంటే ఎరుపెక్కే నాజూకయిన శరీరం, పాలవంటి తెల్లటి రంగు, ఆరడుగుల అందమయిన విగ్రహం-మగాడు కూడా మరోసారి చూడాలనిపించే రూపసి

# దీపావళి


వెలిగించు వెలిగించు
దీపకాంతి వ్రతుల్!
తొలగించు తొలగించు
ఘోర తిమిరా ద్రుముల్!
పాపావళిని ప్రేల్చి
తాపావళిని కూల్చి
అవనినందన వనిగ
భువిని దివిగా మార్చి
ఎద ఎదను అనురాగ
వీణియల మీటించి
పాదపాదను సిరిమల్లె
చిరునవ్వు లొదిగించు
దీపావళీ! నీకు మా స్వాగతం!
ఆరాధనం! దీప నీరాజనం


— కొంగే సుధాకరరావు




దివాకర్. హైదరాబాద్‌లో కో ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్‌గా వుంటున్నాడట. ఈ మధ్యే చిన్న ఇల్లు కొనుక్కున్నాడట. ఏవో చెప్తోంది మల్లిక. నేను మాత్రం దివాకర్ మీదనుంచి దృష్టి మరల్చలేక పోయాను. పరిచయం చేసిన మరుక్షణమే దివాకర్ మాట్లాడడం ప్రారంభించాడు.

"మీ గురించి మల్లిక చెప్పిందండీ" అన్న ఒక్క వాక్యమే మేం కలిసి మాట్లాడిన పది నిముషాల్లో ఆయన నా గురించి మాట్లాడింది. "నేను సికింద్రాబాద్ క్లబ్‌లో మెంబర్నండి. నిజానికి నాకు అవాలని లేదు. కనీసం ఆరు వందల మంది మెంబర్లు నేనంటే పడిచస్తారు. 'దివాకర్, నువ్వు మెంబర్‌వి కాకపోతే మేమంతా రిజైన్ చేస్తాం' అన్నారు. వాళ్ళకోసం ఒప్పుకున్నాను. మీకు తెలుసా? నా మోటార్ సైకిలు శబ్దం వింటే వాలు-సగం మంది గేటు దగ్గరకు పరిగెత్తుకు వస్తారు. 'నీ మోటార్ సైకిల్ శబ్దంలోనే ఒక ప్రత్యేకత వుంది దివాకర్' అంటారు. ఆఫీసులోనూ అంతే. మొన్న నేనొక రిపోర్టు డిక్టేట్ చేస్తే-ఆఫీసు ఆఫీసంతా సర్క్యులేట్ చేసి చదువుకొన్నారు. స్టేట్‌లో ఎక్కడి కెళ్ళినా 'దివాకర్ రాసిన ఫైల్ కదూ యిది' అంటారు. నిజానికి నేను అమలాపురంలో పనిచేసే రోజుల్లో-"






నేను తెల్లబోయి అతని మాటలు వింటున్నాను. మల్లిక నిస్పృహోయంగా భర్తని గమనిస్తోంది. మొదటి రోజు కురూపి అయిన తనని చూసినప్పుడు నా కళ్ళలో కనిపించిన ఆశ్చర్యం, వెగటు లాంటిది-దివాకర్‌తో మాట్లాడినప్పుడు నా కళ్ళలో గుర్తుపట్టింది మల్లిక.

భర్తని ఆపి "రేపు మా యింటికి భోజనానికి రాకూడదూ?" అంది.

సాధ్యం కాదని ఏదో కారణం చెప్పబోయాను.

దివాకర్ అందుకున్నాడు-"మా యిల్లు మీరు చూడాలి. డైనింగ్ సెట్ ప్రత్యేకంగా చైనా పింగాణీ. మా యింటికెవరొచ్చినా భోజనానికి ముందు ఆ సెట్ చూసి మూర్ఛ పోతాడు. 'దివాకర్ నీ టేస్టే టేస్టు. మొగలాయీల కాలంలో నువ్వుంటే తాజ్ మహల్ బాబులాంటి మాన్యుమెంట్ కట్టేవాడివి ' అంటారు. మనకి పొగడ్తలు కిట్టవనుకోండి..."

ఆయన ధోరణి నుంచి అప్పటికి బయట పడడానికయినా వస్తానని ఒప్పుకున్నాను.

మర్నాడు నేను యింటికి వెళ్ళేసరికి దివాకర్ బయటికెళ్ళాడు. మల్లికతో మాట్లాడడానికి అదను దొరికింది. వాళ్ళిద్దరి ఫామిలీ ఫోటో, పెళ్ళి ఆల్బం-హనీమూన్ ఫోటోలు అన్నీ చూపించింది. వాటిని చూస్తున్నంతసేపూ నా కళ్ళలో ఆశ్చర్యాన్ని గమనిస్తూనే వుంది మల్లిక. చిరునవ్వు నవ్వుతూ "అసలు మేమిద్దరం ఎలా కలిశామా-ఈ పెళ్ళి ఎలా జరిగిందా అని అడగాలని వుంది కదూ మీకు?" అంది. ఎలా అడగాలా అన్న ప్రశ్న ఆమే బయట పెట్టడంతో నిట్టూర్చాను. "అవును. ఇదంతా ఎలా జరిగింది?" అన్నాను.

ఓసారి హోటల్లో మల్లిక ఒంటరిగా కూర్చుని కాఫీ తాగుతూండగా పక్క బల్ల దగ్గిర నలుగురు స్నేహితుల్తో కూర్చుని వున్నాడు దివాకర్. వీలయినంత వరకు ముఖం చాటు చేసుకు కూర్చోడానికి అలవాటుపడ్డ మల్లిక వాళ్ళ మాటల్ని మాత్రం వింటోంది. అనర్గళంగా తన గురించి తప్ప మరే విషయమూ మాట్లాడని దివాకర్‌ని ఆ నలుగురూ యిబ్బందిగా చూడడం, విసుగ్గా ముఖం పెట్టడం, ఒకరిద్దరు ముఖంమీదే తమ అసహ్యాన్ని ప్రకటించడం గమనించింది. తన మాటల్కి తనే ఆనందిస్తున్న దివాకర్ పట్ల మనుషుల విముఖత-తన పట్ల విముఖత వంటిదే అని గుర్తించింది. నలుగురూ మెల్లగా జారుకోవడం చూసి ఫక్కున నవ్వేసింది మల్లిక. అదిగో, అప్పుడు మల్లికని మొదటిసారిగా చూశాడు దివాకర్. తన [illegible] పైకంలో వున్న దివాకర్



## వ్యక్తిగత ప్రమాద భీమా: సాంఘిక భద్రతా పథకం

కేంద్ర ప్రభుత్వం "వ్యక్తిగత ప్రమాద భీమా: సాంఘిక భద్రతా పథకాన్ని" 1985లో దేశవ్యాప్తంగా మొదట వంద జిల్లాలలో ప్రారంభించి, 1986లో దానిని మరి వంద జిల్లాలకు విస్తరించింది.

ఏడవ ప్రణాళిక ఆఖరు అయేలోగా దీనిని దేశం అంతటా అమలుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

కుటుంబాన్ని పోషించే వ్యక్తి కనక ప్రమాదంలో మరణిస్తే అతనిపై ఆధారపడిన పేదవారికి ఈ పథకం క్రింద మూడు వేల రూపాయిల వరకు సహాయం లభిస్తుంది. అయితే ఆ కుటుంబానికి వేరే ఏ విధంగాను ప్రభుత్వం నుంచి పరిహారం అందే అవకాశం వుండరాదు. అంతేకాక, సాలీనా 5 వేల రూపాయిలకన్నా తక్కువ ఆదాయం వచ్చే కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది.

ప్రమాదం జరిగిన 90 రోజులలోగా దరఖాస్తులు అందాలి. ఇందుకై ప్రత్యేక అధికారులు వుంటారు. అంతేకాక నాలుగు ప్రాంతీయ కార్యాలయాలు ఇందుకై పనిచేస్తున్నాయి.

దక్షిణ ప్రాంతానికి యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్ లిమిటెడ్ సంస్థ ఈ పనిని నిర్వహిస్తోంది.

ఈ పథకాన్ని ఫలప్రదం చేయడానికై రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశాయి. వీటి ద్వారా అన్ని వివరాలను తెలుసుకోవచ్చును.

మల్లికలో కురూపితనం కనిపించలేదు. ఆమె జీవితంలో నిస్పృహభావం లేకుండా చూసిన మొదటి వ్యక్తి అతనే. దివాకర్ తన బల్ల దగ్గరకి వచ్చి పరిచయం చేసుకున్నాడు.

"మీకు నా మాటలు నవ్వుని కలిగించాయా? కరెక్టుగా నా మిత్రులంతా అలాగే భావిస్తారండీ!" ప్రస్తుతం తన బల్ల దగ్గర్నుంచి పారిపోయిన మిత్రుల్ని ఆవిడ చూపిందన్న సంగతి మరిచిపోయాడు. "హైదరాబాద్‌లో నేను ట్రైనింగ్‌కి వెళ్ళిన రోజుల్లో మైగాడ్! ఇద్దరు లేడీ ఆఫీసర్లు వచ్చారు. నేను నోరిప్పితే వాలు" అలా గంట పైగా మాట్లాడుతున్నాడు. ఓపిగ్గా వింది మల్లిక. తనలో వున్న అంద వికారిని అసహ్యించుకోని అతనిపట్ల కృతజ్ఞతతో అతని బలహీనతకి శ్రోత అయింది. తన స్వోత్కర్షని అంగీకరించే ఆమె అతనికి ఆప్తమయిన మిత్రురాలయింది. ఆ ఒక్క అవలక్షణాన్ని ఆమెలో మరిచిపోగలిగితే సెక్స్‌లో మల్లిక ఏ ఆడదానికీ తీసిపోదు. అచిరకాలంలోనే వాళ్ళిద్దరికీ పెళ్ళయిపోయింది.

"అతని అందం నిన్ను ఆకర్షించలేదా?" అన్నాను ఆశ్చర్యంగా ఆమె చెప్పినదంతా విని.

"ఆ అందం నాకక్కరలేదు. అటువంటి మనిషిలో ఆ మాత్రం అవలక్షణాన్ని పెట్టి దేవుడు నాకు ఉపకారం చేశాడు" అంది.

దివాకర్ వచ్చాడు. "మీరూ వచ్చేశారా! నేననుకొంటూనే వున్నాను. మా బాస్‌కి వీడ్కోలు సభ ఏర్పాటు చేశాం. సభలు ఏర్పాటు చెయ్యడంలో నాది ఓ స్పెషాలిటీ. ఓసారి అమలాపురంలో కొత్తగా వచ్చిన ఆఫీసరుగారికి నేను స్వాగతం చెబుతుంటే అతనికి ఆనందంతో కళ్ళు నీళ్ళు తిరిగాయి."

నేను 'బోర్' అవుతున్నానని తెలిసి మల్లిక నవ్వుతోంది. ఆమె మాత్రం చెక్కు చెదరని ఉత్సాహంతో ఆయన మాటలు వింటోంది. ఆమెతో మాట్లాడేటప్పుడు మనకి కనిపించని ఏదో సౌందర్యాన్ని ఆమెలో చూస్తున్నాడు దివాకర్. ఆమె శరీరానికున్న కురూపితనం అతని మనస్సుకి పట్టనే లేదు. ఆ క్షణాన దివాకర్ వాచాలత్వం నన్ను బాధపెట్టలేదు. గుడ్డివాడికి కుంటివాడు చూపయి, కుంటి వాడికి గుడ్డివాడు ఊతం అయే ఒద్దిక ఈ సృష్టిలో ఎంత విచిత్రమయింది అనిపించింది.

సృష్టిలో ప్రతి బలహీనతలోనూ ఒక ప్రయోజనం వుంది. సరాసరి చెట్ల ఆకులను కొరుకుతినే అనాది కాలంనాటి డినోసార్ నుంచి బురదలో కన్నం చేసుకు బతికే వానపాము వరకు అందమయిన ప్రయోజనాన్ని కల్పించాడు సృష్టికర్త అనిపించింది. ●




Diwali Greetings

**KIDS PARADISE**

[AC & Non AC]

**CHILDREN CARE CENTRE**

**REGULAR CLASSES FOR NURSERY &**
**TUTION CLASSES FOR 1 TO 10th ALSO**

D.No. 32-1-9 Prajasakti Nagar **VIJAYAWADA — 10**

**BID FARE WELL TO WORRIES BY JOINING YOUR BABY IN OUR 'CARE WELL CRECHE'**

PRINCIPAL: Smt. **MOTURU KAMALARANI**

**Phone: 62654**

FRIENDS